# వసంతంలో శిశిరం

-సురేఖ మాచిరాజు

అవి శశాంక్ డిగ్రీ చదువుతున్న రోజులు. సముద్రతీరానగల ఆతని కళాశాల వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉండేది. రోజూ ఇంటినుండి గంట ప్రయాణమైనా బడలిక లేకుండా సాగిపోయేది రోజు. సుధాకర్, భాస్కర్ అతనికి మంచి స్నేహితులు. అతని దిన చర్యలో పదవ తరగతి, మెట్రిక్యులేషన్ తర్ఫీదునివ్వడం కూడా ఒకటి. అయితే ఆ శిక్షణాలయానికి ఓ పార్క్ గుండా వెళ్లేవాడు.

ఒక రోజు సాయంత్రం పార్కుగుండా పోతున్న అతనికి "హల్లో! Excuse me!" అన్న పిలుపు వినిపించింది - అదీ ఆడువారి గొంతుతో. తనని కాదనుకొని పట్టించుకోకుండా మరి రెండు అడుగులు వేసేసరికి ఆ పిలుపు మరింత దగ్గరయ్యింది. అనుమానంగా వెనుదిరిగి చూసిన శశాంక్ ను 'బాపు' బొమ్మలాంటి రమణి కనులను కాస్తంత విశాలం చేసి, కనురెప్పల్ని టపటపలాడిస్తూ "నన్ను ఇక్కడకు రమ్మని చెప్పి అలా వెళ్ళిపోతున్నారేమిటి?" అని ప్రశ్నించేసరికి శశాంక్ కు మతి పోయినట్లయింది. "ఆమె వంటిమీద తెలివివుండే మాట్లాడుతోందా? లేకపోతే నేనేంటి! - ఆమెను రమ్మనడమేమిటి!!" అనుకుంటూ అదే ప్రశ్నను అమెను అడిగాడు ఆమెను తికమక పెట్టే ఉద్దేశ్యంతో. "మీ పేరు శశాంకే కదా! మీరు డిగ్రీ చదువుతున్నారు కదా!" అంటూ తడుముకోకుండా శశాంక్ బయోడేటా వినిపించడంతో అవాక్కవడం శశాంక్ వంతయింది. "రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా! అన్నట్లు అంత నిర్మొహమాటంగా నన్ను రమ్మన్నావుగా అంటూ నిలదీసిన ఈమె నా బయోడేటా తెలుసుకోవడంలో ఆశ్చర్యం ఏముంది?" అనుకున్నాడు శశాంక్. ఊహించని పరిణామానికి శశాంక్ కు చమటలు పట్టాయి. సన్నగా వణుకు ప్రారంభమైంది. ధైర్యాన్ని అభినయిస్తూ "ఎప్పుడు? - ఎక్కడకు రమ్మన్నాను?" అని రెట్టించాడు. ఆమె వ్యంగ్యంగా "అన్నీ చేసి ఏమీ ఎరగనట్లు నటిస్తారెందుకు - మీరేగా గళ్ళచొక్కా, Jean pant తో 6 - 6:30 మధ్య వస్తానని ఉత్తరం రాసారు " అనడంతో శశాంక్ 1000 వోల్ట్ విద్యుద్ఘాతానికి గురైన వాడిలా విలవిలలాడాడు.

ఇలా జరుగుతూ వుండగా అంతర్లీనంగా శశాంక్ ఆలోచనలు పగ్గాలు లేని గుఱ్ఱాలవలే పరిపరి విధాల పోసాగాయి. "ఎవరైనా తనపేరుతో ఆమెకు ఉత్తరం రాసి ఏడిపించదలచుకున్నారా? ఆమె నాకు అబద్ధం చెబుతోందా? దానివలన ఆమెకు లాభమేమిటి? డబ్బులకోసం ఆమె ఈ నాటకం ఆడుతోందా?" సమాధానం తెలియని ప్రశ్నలు. ఏమి మాట్లాడాలో తెలియడంలేదు. ప్రస్తుతానికి అతని కర్తవ్యం ఆమెను వదిలించుకోవడమే. "మీ పేరు .. " అనబోయి గొంతులోనే దానిని పూడ్చివేశాడు శశాంక్. "పేరు తెలియకుండానే ఉత్తరం వ్రాసారా?" అంటుందేమోనని భయపడి. "పిల్లకి చెలగాటం - నాకు ప్రాణ సంకటం" అనుకున్నాడు మనసులో. "నేను పరీక్షలకి తయారు కావాలి - రేపు కలుద్దామా!" అన్నాడు ఆమెను వదిలించుకునే ప్రయత్నం చేస్తూ. "ఇంతకీ ఎందుకు రమ్మన్నారో చెప్పారుకారు. మీరు వ్రాసిన ఉత్తరం మా అమ్మానాన్నలు చూడలేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే నా గురించి ఎంత చెడ్డగా అనుకునేవారో కదా!" అంటూ రెచ్చిపోతున్న ఆమెను చూసి "ఈమె నటనతో జీవించేస్తోంది - ఇప్పుడేమిటి మార్గం!" అనుకున్నవాడై "చూడండి! నేను ఉత్తరం వ్రాయలేదు ... మీరు ఎవరినిచూసి ఎవరని అనుకుంటున్నారో - మీరెక్కడుంటారో, మీ పేరేమిటో తెలియని నేను మీకు ఉత్తరం రాయడమెలా సాధ్యం?

నాకు కాలాతీతమవుతోంది. నే వెళ్ళాలి" అంటూ అక్కడి నుండి నిష్క్రమించడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఆమె కోపంగా చూస్తూ నిలుచుండిపోయింది. ఈ విషయాన్ని సుధాకర్, భాస్కర్ లతో పంచుకున్నప్పుడు వారిలో ఏదో వుత్సాహం ... ఆమె ఎవరో కనిపెట్టాలని ... ఆమె మాటలలో నిజం శాతమెంతో తెలుసుకోవాలని కుతూహలం చోటు చేసుకున్నాయి. ఒక విషయం వారిని బాగా ఆశ్చర్య పరచింది. వాళ్ళ Classలో అంతా Detective అని ముద్దుగా పిలుచుకునే శశాంక్ చాలా చురుకైనవాడు. ఆవులించకపోయినా పేగులు లెక్కపెట్టగల సమర్ధుడు. చాలా విషయాలను జరగబోయే ముందుగానే వూహించి చెప్పేవాడు. ఓసారి అందరూ Physics class కోసం సిద్ధమౌతున్న సమయంలో శశాంక్ "ఈ రోజు physics class ఉండదు." అన్నాడు. "ఎవరు చెప్పారు?" అని ఏక కంఠంతో అందరూ (త్వరగా వెళ్ళిపోవచ్చునని) ఆనందంగా అడిగారు. "నా ఊహ!" సమాధానమిచ్చాడు. అదే నిజమైంది. తరువాత సుధాకర్, భాస్కర్ లతో శశాంక్ చెప్పాడు physics lecturer గారి స్కూటర్ tireలో గాలి పోయిందని - అతను స్కూటర్ని నడిపిస్తూ రావడం తను బస్సులో వస్తున్నప్పుడు గమనించానని. అదే బస్సులో వచ్చిన సుధాకర్, భాస్కర్ లు ఆ విషయాన్ని గమనించలేదు. ఏ విషయాన్నైనా నిశితంగా పరిశీలించడం, త్వరగా లెక్కలు కట్టడంలో అతనికి అతనే సాటి. అలాంటి శశాంక్ మీదే ప్రయోగాలు చేస్తున్న ఈ అమ్మాయి ఎవరై ఉంటుంది? అన్నదే వారిని వేధిస్తున్న ప్రశ్న.

ఈ విషయాన్ని తాత్కాలికముగా ప్రక్కనపెట్టి, పరీక్షల అనంతరం మిత్ర బృందం మళ్ళీ సమావేశమయ్యింది. గత రెండు వారాలుగా ఆ పార్క్ దరిదాపులకు కూడా పోని శశాంక్ ఇప్పుడు మళ్ళీ పార్కుకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. మిత్రులు సుధాకర్, భాస్కర్ లు కూడా వచ్చి కాస్తంత దూరంగా ఉండి గమనించసాగారు. కాలం గడుస్తోంది ... ఆమె జాడలేదు. మూడు రోజులు ఇదే ప్రహసనం నడిచింది. "పార్టీ మార్చేసి వుంటుంది గురూ!" అన్నాడు సుధాకర్. "డిట్టూ! (సుధాకర్, భాస్కర్లు శశాంక్ ను ముద్దుగా పిలుచుకునే పేరు) మాకు కథగాని చెప్పలేదు కదా!" అప్పుడప్పుడు శశాంక్ చెప్పే కథలను దృష్టిలో పెట్టుకుని అడిగాడు భాస్కర్. "నమ్మకపోతే మానెయ్యండి! - మిమ్మల్నెవడు నమ్మమన్నాడు?" అన్నాడు శశాంక్ కటువుగా.

మరొకరోజు శశాంక్ ఒక్కడూ వస్తున్నపుడు ఆమె మళ్ళీ తారసపడింది. "బాగున్నారా? పరీక్షలు బాగా వ్రాసారా? మరునాడు వస్తానని చెప్పి మళ్ళీ కనబడలేదేమి?" అంటూ ప్రశ్నలతో ముంచెత్తింది. శశాంక్ "బాగున్నాను. బాగానే వ్రాసాను. పరీక్షల కారణంగా రాలేదు" అని ముక్తసరిగా సమాధానాలిచ్చాడు. "ఇప్పుడు భాస్కర్, సుధాకర్ వుంటే ఎంత బాగుండేది " అని మనసులో అనుకుంటున్నంతలో "ఇప్పుడు మీరు చెప్పదలచుకున్న విషయం చెప్పడానికేమీ అభ్యంతరం లేదుగా " నిలదీసింది "కూర్చోండి" అంటూ బల్లమీదకు ఆహ్వానిస్తూ. గత్యంతరంలేక మొహమాటంగా (మోహవాటంగా కాదండోయ్!) కాస్త దూరంగా కూర్చున్నాడు. "చాలామంది అబ్బాయిల మాదిరి మీది కూడా సినిమా పైత్యమైతే నే చెప్పేది ఒక్కటే! ఎదురుపడి విషయాన్ని చెప్పడానికి ధైర్యం లేనప్పుడు ప్రేమ-దోమ అని తిరగకండి" అంటూ ఉపన్యాసం మొదలుపెట్టింది. ఆమె వాక్ప్రవాహాన్ని మధ్యలోనే ఆపి "నేనా ఉత్తరం వ్రాయలేదని చెప్పానుగా! మీరు అపార్ధం చేసుకుంటున్నారు" అన్నాడు శశాంక్.

ఇక ఆమెకు అవకాశమివ్వకుండా "మీరు ఆ ఉత్తరం నాకు చూపిస్తే దాన్ని ఎవరు వ్రాసారో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం" అన్నాడు . ఆమె అందుకు అంగీకరించింది. వాళ్ళ నాన్నగారు స్కూలు టీచరని, క్రమశిక్షణ విషయంలో ఆయన చాలా ఖచ్చితంగా ఉంటారని, ఆ కారణం చేతే ఆమెకు వచ్చిన ఉత్తరం చదవకుండా ఆమెకు అందించారని, ఆమె మీద ఆయనకు, వాళ్ళ అమ్మగారికి చాలా నమ్మకమని ఇంకా చాలా విషయాలు ప్రస్తావించింది. శశాంక్ ను కూడా అతని విషయాలు చెప్పమని అడిగింది. "అసలే తెలిసిన ఈ కొద్దిపాటి విషయాలతో నా దుంపతెంచేస్తోంది. అన్ని విషయాలూ చెప్తే 'పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లే' కదా!" అనుకుని విషయాన్ని ప్రక్కదారి పట్టించాడు శశాంక్ "మీరు డిగ్రీ ఏ కాలేజీలో చేస్తున్నారు " అంటూ. "నేను డిగ్రీ చేస్తున్నట్లు మీకెలా తెలుసు " ఆశ్చర్యం నిండిన కళ్ళతో అడిగింది. "చోర వృత్తి నీ అంత కాకపోయినా నాకూ తెలుసు - (రహస్య సమాచార చోర) చారగణాధీశుండనై, నేనేల ఈవేళ ఓ బాలకు దాసోహమనుటయా! సిగ్గు సిగ్గు - జై చాణక్య" అని మనసులో అనుకుంటూ "ఊహించాను" అన్నాడు చిరు నగవుతో. "Good guess!" అభినందించింది. శశాంక్ లో మునుపటి ఆందోళన లేదిప్పుడు. మళ్ళీ అక్కడే కలుసుకొనేందుకు సమయము నిర్ధారణ చేసుకొని, ఈసారి ఆమె సోదరునితో కూడా వస్తానని చెప్పి ఇంటి దారి పట్టింది. ఆమె ఎక్కడ ఉంటుందో తెలుసుకోవాలని శశాంక్ ఆమెను (ఆమె దృష్టిలో పడకుండా) అనుసరించాడు. ఓ సందులోకి తిరిగి ఆమె శశాంక్ చూసే సమయానికి అదృశ్యమయ్యింది. బహుశా ఆమె అదే వీధిలో వుంటుందేమో అనుకుని ఇంటిదారి పట్టాడు శశాంక్.

"యురేకా " అంటూ మిత్రద్వయాన్ని కలిసిన శశాంక్ ను చూసి ఏదో విశేషమే ఉండి ఉంటుందని సుధాకర్, భాస్కర్‌లు ఆతృతతో శశాంక్ ను సమీపించి కూర్చున్నారు. శశాంక్ జరిగిన సంఘటనని పూస గ్రుచ్చినట్లు చెప్పాడు. "బాసూ! సందేహంలేదు. నిన్ను వలలో వేసుకోవడానికే ఆమె ఈ నాటకం ఆడుతోంది. మళ్ళీ వచ్చినపుడు ఆమె ఉత్తరం తేదు చూడు" అన్నాడు భాస్కర్. "వాళ్ళ బ్రదర్ని తీసుకొస్తానని అంది కదా! జాగ్రత్త డిట్టూ! వాడిని నీ మీదకు ఉసిగొల్పుతుందేమో " అంటూ సందేహం వెలిబుచ్చాడు సుధాకర్. "మేమూ వస్తే " అంటూ ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించేసరికి "చూడండి! పహిల్వానులు దిగారు ... మీరు లాఠీల కిందకూడా పనిచెయ్యరు. రివటకాడల్లాగ వున్నారు" అని ఖండించేసాడు శశాంక్.

రెండు రోజుల అనంతరం శశాంక్ పార్కుదగ్గరకి అనుకున్న సమయానికి ఐదు నిముషములు ఆలస్యముగా వచ్చాడు. పార్క్ అంతా కలియజూసాడు. ఆమె జాడలేదు. అతని గుండె శబ్దం అతనికే స్పష్టముగా వినిపిస్తోంది. ఆమె రాదా? వాళ్ళ సోదరుడు అంటే అన్నయ్యా? తమ్ముడా? అంటూ యక్ష ప్రశ్నలను సంధిస్తున్న మనసుకు సమాధానాలు ఆలోచిస్తున్న తరుణంలో దూరంగా కాళ్ళపట్టాల శబ్దం వినిపించింది. అసంకల్పితముగా శశాంక్ కళ్ళు ఆ దిశవైపు మరలాయి. ఆమె పక్కన ఓ 8-10 సంవత్సరాల అబ్బాయి కూడా వున్నాడు. "ఓ! ఈ బుడుగునా సోదరుడని చెప్పి గాబరాపెట్టింది " అనుకుని అమెను కళ్ళతోనే పలకరించాడు. పార్కులో ఓ మూల బెంచ్ మీద కూర్చున్నారిద్దరూ. బుడుగు కాస్త దూరంలో వాటర్ గన్‌తో ఆడుకుంటున్నాడు. "వాడు మా తమ్ముడు సిద్దూ" అని చెప్పగానే "మీ పేరు చెప్పలేదు ఇంతవరకూ" అన్నాడు శశాంక్. "వసంత లక్ష్మి" అన్నది. ఆ మాట, ఈ మాట అయ్యాక "ఇంతకీ ఉత్తరం తెచ్చారా?" అని అడిగిన శశాంక్ కు "అయ్యో! నా డైరీలో పెట్టి తేవడం మరచిపోయాను" అని ఆశ్చర్యాన్ని అభినయించింది. "సందేహం లేదు! భాస్కర్ అనుమానమే నిజం" అనుకుంటుండగా "ఉత్తరం ఎవరు వ్రాసారో గాని మీలాంటి మంచి వ్యక్తితో పరిచయమైంది. మీరు ఆ ఉత్తరం

వ్రాసి వుండరని నాకు మొదటిరోజే అనుమానం వచ్చింది. ఆ ఉత్తరం మీరే వ్రాసి ఉంటే అంతగా నటించడం ఆస్కార్ గ్రహీతలకే కష్టం" అని వెన్న రాస్తున్నట్లు మాట్లాడుతున్న ఆమె చతురతకు చప్పట్లు కొట్టాలన్నంత ఆవేశం వచ్చింది శశాంక్ కి. "సందేహంలేదు ఈమె తనని బుట్టలో వెయ్యడానికి ప్రయత్నిస్తోంది. ఈమెకు నా విషయాలు ఎలా తెలిసివుంటాయి?" అని ఆలోచిస్తూ "తిడతాండ్రా? పొగడతాండ్రా?" అంటూ ఓ సినీ నటుడ్ని అనుకరించాడు శశాంక్. ఓ మందహాసాన్ని ఒలికించి "మీ అలవాట్లు ఏమిటి?" అంటూ సంభాషణను కొనసాగించడానికి బీజం వేసింది. "చూస్తూ చూస్తూ పులినోట్లో తల పెట్టడం, కొరివితో తల గోక్కోవడం, ఈమెకు నా అలవాట్లు చెప్పడం ప్రమాదం కదా!" అనుకున్నవాడై Triple T అన్నాడు శశాంక్. "అంటే?" అని ఆమె ప్రశ్నార్థకం చూపేసరికి "తినడం, తిరగడం, తిష్టవెయ్యడం" అన్నాడు. "మరి మీ అలవాట్లో?" ఆమెకేమాత్రము అవకాశమివ్వకుండా ప్రశ్నను సంధించాడు. "సినిమాలు చూడడం" అన్న సమాధానము విని, "వేరే చెప్పాలా! ఆ పైత్యం ప్రత్యక్షముగా కనబడుతుంటే" అనుకున్నాడు శశాంక్ మనసులో. "ఇంకా పుస్తక పఠనం, వంట చెయ్యడం" చెప్పింది. "అంతేనా!" అన్నాడు ఆటపట్టించడానికన్నట్లు. "మీ కంటే నయమేగా!" ఎత్తిపొడిచింది. మౌనం కాసేపు నర్తించాక "చాలాసేపయింది. ఇక నే వెళ్తాను. వచ్చే శనివారం గోకుల్ టాకీసులో మార్నింగ్ షో సినిమాకు వెళ్దామని అనుకుంటున్నాను. మీరూ వస్తారా?" ప్రశ్నించింది. సరేనన్నాడు శశాంక్.

మిత్రులతో ఈ ప్రస్తావన వచ్చినప్పుడు "సినిమాకి రమ్మందోచ్!" అనగానే అంతా ముక్కుమీద వేలేసుకున్నారు. "గుడ్డు నుండి సీతాకోకచిలుక కూడా లార్వా, కోశస్థ దశలను దాటిన తరువాతే ఏర్పడుతుంది. ఈమేంటి ఇంత త్వరగా ప్రేమని పక్కానికి తెచ్చేస్తోంది?" అన్నది వారి సందేహం. "ఆలస్యం అమృతం విషం - ఇంకెందుకు ఆలస్యం ప్రొసీడ్" అన్నాడు సుధాకర్. భాస్కర్ వంత పాడాడు. "మీకేం ఏమైనా చెబుతారు. ఇరుక్కునేది నేను కదా! తన వళ్ళు కాకపోతే కాశీ దాక దేకమన్నాడట వెనుకటికొకడు" అని అయిష్టాన్ని నటించాడు, వాళ్ళుకూడా వెంటపడతారేమోనని, శశాంక్.

అనుకున్న సమయానికి సినిమా హాలును చేరాడు శశాంక్. ఆడవాళ్ళ క్యూలో చిలకాకుపచ్చ, ఎరుపుల కలబోతగా రూపుదిద్దుకున్న ఆమె చూడీదర్, పరిసరాలని దృక్కోణానికి దూరంచేస్తూ కళ్ళన్నీ ఆమెమీదే లగ్నమయ్యేందుకుదోహదం చేస్తున్నాది. ఇక హాలులో సినిమా ప్రారంభమైంది. ఒక అమ్మాయితో సినిమాకు రావడం ఉల్లాసాన్ని కలిగిస్తోంది. సినిమా చూడడం మాని ప్రక్కనున్న మానినినే కనుకొనలగుండా చూస్తూ కాలంగడిపాడు. అనంతరం ఆమెకు దూరమౌతున్నాననే ఆలోచన ఏదో దిగులుగా తోస్తోంది. 'వాసంతి' అని ఆమెను ముద్దుగా పిలవాలని అనుకున్నాడు. కాని అందుకు సాహసించలేకపోయాడు. మళ్ళీ కలుసుకోవడానికి సమయం నిశ్చయించుకుని ఇంటి దారి పట్టాడు. ఆమెను మళ్ళీ ఎప్పుడు కలుస్తానా అని ఎదురుచూపు అప్పుడే మొదలయ్యింది. మాటలలో వ్యక్తం చేయలేని భావన అది. అదేనేమో ప్రేమ అంటే!

వాసంతిని కలువబోతున్నాననే ఊహ శశాంక్ ను నేలమీద నిలువనియ్యడంలేదు. అనుకున్న సమయానికి చాలా ముందుగానే పార్కుకు చేరాడు. మాటిమాటికి గడియారము చూడసాగాడు. అనుకున్న సమయము అయింది - ఇక ఈ క్షణమో, మరు క్షణమో ఆమె వస్తుందని రాడార్ కంటే వేగంగా పరిసరాలను గమనిస్తున్నాడు. ఐదు ... పది ... ముప్పయి ... అరవై నిమిషాలు గడిచాయి. శశాంక్ కు నిరీక్షణే మిగిలింది. ఇలా ప్రతిరోజూ కొన్నాళ్ళపాటు ఎదురు చూసాడు. ప్రయోజనం లేదు. అతని డిగ్రీ పూర్తయింది. వాసంతి జ్ఞాపకాలు ఇంకా మెదులుతూనేవున్నాయి. ఆమెను నిష్కారణంగా అనుమానించాడేమో! ఏ రోజైనా ఆమె ఆకాశం నుండో భూమినుండో ఊడిపడుతుందనే ఆశ శశాంక్ను ఆ పార్కుకు నడిపిస్తున్నది ఈ నాటికీ. మీకెక్కడైనా వసంతలక్ష్మి కనిపిస్తే ఆచూకీ మా శశాంక్కు తెలిపి పుణ్యం కట్టుకోరూ?